క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సత్తయ్య

యాచారం: మొండిగౌరెల్లిలో పునఃనిర్మాణం చేపడుతున్న స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణం కోసం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం రూ.రెండు లక్షల 51 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ.5,11,113 విరాళం అందజేస్తానని గతంలో సత్తయ్య హామీ ఇచ్చారు. మొదట్లో రూ.రెండున్నర లక్షలు అందజేయగా, సోమవారం మిగితా మొత్తాన్ని విరాళంగా ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ గుప్తకు అందజేశారు. కాగా మొండిగౌరెల్లి గ్రామస్తులు రూ.2 కోట్లకు పైగా నిధులతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు చేపడుతున్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

మహేశ్వరం డిపో మేనేజర్‌కు ముద్వీన్ గ్రామస్తుల వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండల కేంద్రం నుంచి కడ్తాల మండలం ముద్వీన్, చరికొండ మీదుగా మాల్ వరకు ఆర్టీసీ బస్సులను నడిపించాలని ముద్వీన్ గ్రామస్తులు కోరారు. మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్‌రెడ్డిని ఆ గ్రామ నాయకులు వెంకటయ్య, యాదయ్య, మహేశ్, వినోద్ తదితరులు కలిసి ఈ విషయమై వినతిపత్రం అందించారు. గతంలో ఆమనగల్లు నుంచి ముద్వీన్, చరికొండ, మేడిపల్లి మీదుగా బస్సులను నడిపేవారని దీనివల్ల అనేక గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఏర్పడిందని వారు వివరించారు. ప్రస్తుతం ఈ రూట్‌లో బస్సులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

సీఐ సత్యనారాయణ



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ కోరారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని సాహెబ్‌గూడ గ్రామస్తులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సహకారం అందించాలని కోరారు. వ్యాపార సముదాయాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మారయ్య, మండల ప్రజాపరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌ఖాన్, నాయకులు జంగయ్య, నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ లచ్చిరెడ్డి



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. తరుచూ కరెంట్ సరఫరాలో అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేలా చూడాలని కాలనీవాసులు ఆయనను కోరారు. దీంతో స్పందిస్తూ విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. పలు సమస్యలపై కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. వెంకటాచలం, విక్రం, భ్రమరాంబ, నాయకులు ముత్యాలు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

- వరుస వర్షాలతో పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు
- మండలంలో 21వేల ఎకరాలకు పైగా సాగుకు అనుకూలమైన భూమి
- రైతుబంధు సాయం కోసం ఎదురుచూపు
- విత్తనాలు, ఎరువుల కొరత లేదంటున్న అధికారులు



ట్రాక్టర్‌తో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

యాచారం: ఇటీవల వరుసగా వర్షాలు కురవడానికి తోడు రాష్ట్రానికి తొలకరి పలకరించడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో సాగుకు యోగ్యమైన వ్యవసాయ భూమి 21వేల ఎకరాలుండగా, ఈ ఏడాది ఖరీఫ్‌లో 15వేల ఎకరాలకు పైగా సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 15వేల ఎకరాల్లో 5వేల ఎకరాల వరకు వరి, 5వేల ఎకరాల్లో పత్తి, మిగితా 5వేలకు పైగా ఎకరాల్లో పలు రకాల మెట్ట పంటలు, వివిధ కూరగాయల పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. చింతపట్ల, నల్లవెల్లి, మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, గునుగల్, యాచారం, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో వరితోపాటు పలురకాల కూరగాయల పంటలు సాగుచేసే అవకాశం ఉండగా, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చింతుల్ల, నందివనపర్తి, మాల్, మంతన్‌గౌరెల్లి, కుర్మిద్ద, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో పత్తి పంటతో పాటు కూరగాయలు, వరిపంటను సాగు చేస్తారు. రెండేళ్లుగా పత్తిపంట సాగులో గణనీయమైన లాభాలు వస్తుండటంతో ఈ ఏడాది కూడా రైతులు పత్తిపంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా...

రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత రానివ్వమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏ రైతు కూడా తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, ఫర్టిలైజర్స్ లేవు అని ఆందోళన చెందకుండా కావాల్సిన ఇండెంట్‌ను తెప్పించే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. యాచారం పీఏసీఎస్‌లో రూ.40 లక్షల నిధులతో 28–28– గ్రోమోర్, యూరియా, డీఏపీతో పాటు ఒక టన్ను– తెలంగాణ సోనా, ఒక టన్ను– ఆర్ఎన్ఆర్, ఒక టన్ను– కందులు, రెండు టన్నులు– తెల్ల, పచ్చ జొన్నలు తదితర విత్తనాలను సిద్ధం చేసి ఉంచారు. అదే విధంగా యాచారం, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, మాల్ కేంద్రాల్లో ఉన్న ఫర్టిలైజర్స్ దుకాణాల్లో కూడా సరిపడా ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసి ఉంచారు. పత్తి విత్తనాల నిల్వ విషయంలో వ్యవసాయ శాఖ ఆయా గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులకు ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చింది. రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు సరఫరా చేయాలని సూచించింది. ఆయా గ్రామాల్లోని కొందరు రైతులు పత్తి విత్తనాలను మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్‌కు వెళ్లి తెచ్చుకుంటున్నారు. వ్యాపారులు సైతం అక్కడి నుంచి పత్తి విత్తనాలు తెచ్చి స్థానిక రైతులకు రెండింతలు ధరలు పెంచి గోప్యంగా విక్రయిస్తున్నారు. అయితే వ్యవసాయ శాఖ విత్తనాల కొనుగోళ్ల విషయమై ఆయా గ్రామాల్లో అవగాహన, చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు.

రైతుబంధు కోసం ఎదురుచూపు..

సాగు కోసం పెట్టుబడులు అధికం కావడంతో రైతాంగం రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుబంధు నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో రైతు బంధుకు అర్హులైన రైతులు 16,210 మంది ఉన్నారు. గత యాసంగి పంట కాలం కింద రైతులకు రూ.20 కోట్ల 40 లక్షల నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం జరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు మరోమారు వర్షాలు కురిస్తే విత్తనాలు విత్తేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

“ రైతుబంధు సాయం వేయాలి



ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వ్యవసాయ పనులను మొదలుపెట్టాం. గతేడాదితో పోలిస్తే పెట్టుబడులు రెండింతలు పెరిగాయి. పది రోజుల్లోపు రైతుబంధు నిధులు జమ చేస్తేనే మేలు జరుగుతుంది. సాగు సమయం ముగిస్తే ప్రయోజనం ఉండదు. కొత్త సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– మేకల యాదగిరిరెడ్డి, రైతు మొండిగౌరెల్లి

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



పీఏసీఎస్‌లో రూ.50 లక్షల నిధులతో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను నిల్వ ఉంచాం. ఎరువులు,విత్తనాల విక్రయాల్లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా రైతులకు సేవలు అందిస్తున్నాం. త్వరలో రూ.60 లక్షల నిధులతో నిర్మించిన పీఏసీఎస్ కొత్త భవనాన్ని ప్రారంభిస్తాం.

– రాజేందర్‌రెడ్డి, చైర్మన్, యాచారం పీఏసీఎస్

నకిలీ విత్తనాలతో జాగ్రత్త



నకిలీ విత్తనాలతో కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించాం. నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై దృష్టి పెట్టాం.సాగు విస్తీర్ణం అంచానా మేరకు ఏ రైతుకు ఇబ్బంది రానివ్వం. యాచారం పీఏసీఎస్‌తో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు నిల్వ ఉంచుతున్నాం.

– సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి, యాచారం

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా బాలనగర్ మండలం చిన్నరెవెల్లికి చెందిన మన్యం అనే యువకుడు 5 సంవత్సరాలుగా తలకొండపల్లి మండలంలో కేబుల్ నెట్‌వర్క్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. పనిలో భాగంగా ఇటీవల మండలంలో విద్యుత్ స్తంభం ఎక్కి కేబుల్ వైర్లను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మండలంలోని కేబుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.26,000 సేకరించి సోమవారం మన్యంకు అందజేశారు. అసోసియేషన్ సభ్యులు.. చంద్రకుమార్, ఆంజనేయులు, రాజశేఖర్, సాయిబాబా, తిరుపతయ్య గౌడ్, లక్ష్మీనారాయణ, రహీం, శ్రీను, తిరుపతయ్య, మల్లేష్, రవి, శ్రవణ్ కుమార్, అశోక్, తిరుపతయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల మండలానికి చెందిన..

ఆమనగల్లు: కడ్తాల మండలం బీసీ కాలనీకి చెందిన శ్రీను కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కడ్తాల జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ రూ.7వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జహంగీర్‌బాబా, బుచ్చయ్య, యాదయ్య, శేఖర్, జంగయ్య, కృష్ణ, బాలరాజు, రాజేశ్, భానుకిరణ్ నాయకులు రాఘవేందర్, లాయక్‌అలీ, మహేశ్, యాదయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పడకల్‌కు చెందిన..

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెంటయ్య ఇటీవల మృతి చెందాడు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, ప్రభాకర్, మైసయ్య, రామస్వామి, కిరణ్ కుమార్, చందు, రాములు, ఎల్లయ్య, చంద్రయ్య, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్‌ఐ

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నేటి నుంచి 48 గంటల పాటు ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, సభలు పెట్టొద్దని ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. లౌడ్ స్పీకర్లు పెట్టడం, బాణసంచాలు లాంటివి కాల్చడం చేయొద్దన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోగులకు బ్రెడ్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆ పార్టీ శ్రేణులు సోమవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి అరవింద్ మాట్లాడుతూ.. వేడుకల ముగింపు సందర్భంగా రోగులకు బ్రెడ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజు, శేఖర్‌గౌడ్, వినయ్, సంపత్, ఉదయ్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో పారిశుద్ధ్య పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో సోమవారం మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వివిధ కాలనీల్లో మురుగు కాలువలు నిండిపోయాయి. దీంతో మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో సిబ్బంది మురుగు కాలువలను శుభ్రం చేశారు. స్థానిక పట్టణంలోని సురసముద్రం చెరువు బతుకమ్మ ఘాట్ వద్ద మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారడంతో మరమ్మతు చర్యలు చేపట్టారు. బతుకమ్మ ఘాట్‌ను మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత, కౌన్సిలర్ విజయ్‌కృష్ణ, నర్సింహులు పరిశీలించారు.

పెద్దమ్మతల్లి బోనాలు

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో పెద్దమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి అమ్మవారికి ప్రత్యేక పూజలతో బోనాలు సమర్పించే ఆనవాయితీ ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముదిరాజ్ కుల పెద్దలు తిక్కల కృష్ణముదిరాజ్, సుద్దుల నర్సింహాముదిరాజ్, లక్ష్మయ్య, అంజయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ దర్శకుడు బాబ్జీ

సినీ దర్శకుడు బాబ్జీ

మంచాల: యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని సినీ దర్శకుడు బాబ్జీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిత్తాపూర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రమ శిక్షణతో చదువుతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.భాస్కర్ మాట్లాడుతూ.. యువత దేశభక్తి కలిగి ఉండటంతో పాటు ప్రజలను చైతన్యం చేయడం, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తే తిరుగుబాటు చేయాలని కోరారు. కాగా క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి శ్రీకాంత్ టీం, ద్వితీయ బహుమతి కిరణ్ టీం గెలుచుకుంది. గొర్ల కాపర్ల సంఘం జిల్లా నాయకుడు రావుల జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ, చంద్రయ్య, యాదయ్య, భాషయ్య, రాంరెడ్డి, నాగరాజు, పాండు, కృష్ణ, శర్మ, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

ఎంపీడీఓ బాలశంకర్



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ బాలశంకర్

మంచాల: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. సోమవారం మంచాల మండల కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఈనెల 6వ తేదీనుంచి గ్రామాల్లో నిర్వహించే బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బడీడు పిల్లలందరూ బడిలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం అందరం బాధ్యతగా ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రెడ్డి, సూపరింటెండెంట్ జంగయ్య, సీఆర్‌పీలు గిరీష్, జగదీష్, స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత సృష్టిస్తే చర్యలు

ఎస్‌ఐ బల్‌రాంనాయక్, ఏఓలు అరుణకుమారి, రాజు



ఆమనగల్లు: ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆమనగల్లు: విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాంనాయక్, మండల వ్యవసాయాధికారి అరుణకుమారి హెచ్చరించారు. ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి, ముర్తుజపల్లి, జంగారెడ్డిపల్లి గ్రామాల్లో ఉన్న పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను సోమవారం వారు తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న విత్తనాలు, ఎరువుల, పురుగుల మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులకు సంబంధించి విధిగా బిల్లులను ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, డీలర్లు నరేశ్‌రెడ్డి, మల్లేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు..

తలకొండపల్లి: ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, రైతులకు తప్పక రసీదులు అందజేయాలని మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. మండల పరిధిలోని పడకల్‌లోని ఓం శ్రీ సాయి ట్రేడర్స్, శివ ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, తదితర విత్తన, ఎరువుల దుకాణాలను ఏఓ సోమవారం తనిఖీ చేశారు. ధరల పట్టిక, బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, ఈ–పాస్ మెషీన్ పనితీరు తదితర వాటిని పరిశీలించారు. నాణ్యత కలిగిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. గడువు ముగిసిన సరుకును రైతులకు విక్రయించరాదన్నారు. నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై చర్యలు ఉంటాయన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించండి

ఎంపీపీ కృపేశ్

- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: వచ్చేది వర్షాకాలం...పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీపీ కృపేశ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు 15వ ఫైనాన్స్ నిధులను ఎందుకు ఉపయోగించడంలేదని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని.. వెంటనే 15వ ఫైనాన్స్ నిధులను ఉపయోగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పంచాయతీలకు నిధుల కొరత ఉందని, సిబ్బంది జీతభత్యాలకే ఇబ్బందిగా ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. 60శాతం 15వ ఫైనాన్స్ నిధులను పారిశుద్ధ్యం మెరుగుకు, నీటి ఎద్దడి నివారణకు ఖర్చుపెట్టుకోవచ్చని క్రాంతికిరణ్ తెలిపారు. కోవిడ్ కంటే ముందు గ్రామాలకు నడిచినట్లుగానే ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఎంపీపీ కృపేశ్ కోరారు. పొల్కంపల్లి మీదుగా అనాజ్‌పూర్‌కు నడిపే బస్సును తిరిగి వేయాలని ఎంపీటీసీ మంగ కోరారు. జూన్ 12 నుంచి అన్ని గ్రామాలకు గతంలో మాదిరిగానే బస్సులను నడిపిస్తామని.. అందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకట్‌నాయక్ తెలిపారు.

డ్రగ్స్‌ను అరికట్టాలి..

డ్రగ్స్, గంజాయి బారిన పడి యువత చెడు మార్గంలో పయనిస్తోందని... దీని నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కృపేశ్ కోరారు. డ్రగ్స్ విక్రయించే, కొనుగోలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఎక్కడైన ఇలాంటి విక్రయాలు జరిగినట్లు తెలిస్తే తమకు సమాచారాన్ని ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి కోరారు. హరితహారం కింద ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 3,500 మొక్కలను నాటాలని నిర్ణయించినట్లు ఏపీఓ తిరుపతాచారి తెలిపారు. ఇందుకు అనుగుణంగా పంచాయతీలో మొక్కలను పెంచినట్లు చెప్పారు. పోచారం, మెటిల్లా సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌కు లాభం చేకూరేవిధంగా రోడ్డు వేయడం పట్ల ఎంపీపీ కృపేశ్ ఆర్అండ్‌బీ అధికారులపై మండిపడ్డారు. ఉపాధి హామీ పథకం కింద ఐదు ఏకరాలలోపు భూమి ఉన్న రైతులు జామ, మామిడి తోటలను పెంచేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పీఆర్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌చారి ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జై శ్రీరాం

- ఉపాధి పనుల్లో బయటపడిన శ్రీ రాముడి రాతి విగ్రహం
- పూజలు నిర్వహించిన కూలీలు



యాచారం: మండల పరిధిలోని నల్లవెల్లిలో సోమవారం ఉపాధి పనుల్లో శ్రీరాముడి రాతి విగ్రహం బయటపడింది. కూలీలు ఆ విగ్రహాన్ని శుభ్రం చేసి పూజలు నిర్వహించారు. వివరాలు.. ఉపాధి కూలీలు రోజు మాదిరిగానే ఉపాధి పనులకు వెళ్లారు. గ్రామానికి చెందిన సత్తిరెడ్డి వ్యవసాయ పొలంలో అభివృద్ధి పనులు చేస్తుండగా పురాతన రాతి విగ్రహం బయటపడింది. విగ్రహం బయటపడిన విషయమై ఉపాధి కూలీలు స్థానిక ఈజీఎస్ సిబ్బంది ద్వారా ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి సమాచారం అందించారు. తదనంతరం రాతి విగ్రహాన్ని నీళ్లతో అభిషేకం చేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. గ్రామంలో శ్రీ రాముడి విగ్రహం బయటపడినట్లు విస్తృత ప్రచారం కావడంతో గ్రామస్తులు పెద్ద తరలివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, అతిథులు

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపాలిటీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిబట్ల మున్సిపాలిటీ పాలకవర్గం టీం, మున్సిపాలిటీ అధికారులు, జర్నలిస్టులు మూడు జట్లుగా ఉండి క్రికెట్ ఆడారు. ఫైనల్‌లో మున్సిపాలిటీ అధికారులు, జర్నలిస్టుల మధ్య రసవత్తర పోరు జరిగింది. అయితే జర్నలిస్టులపై మున్సిపాలిటీ అధికారులు స్వల్ప తేడాతో విజయం సాధించారు. అనంతరం విజేతలకు ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ట్రోఫీతోపాటు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, మేనేజర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు మహేందర్, శ్రీనివాస్, రాములు, నాగేష్, ఉదయ్‌పాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.